# హజ్ మరియు ఉమ్రహ్ - 3

[ తెలుగు – Telugu – تلغو ]

షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహిమహుల్లాహ్)

**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**రివ్యూ :** షేఖ్ నజీర్ అహ్మద్

2012 - 1433

IslamHouse.com

# ﴿ الحج والعمرة - ٣ ﴾

« باللغة تلغو »

سماحة الشيخ عبد العزيز بن باز - رحمه الله

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2012 - 1433

IslamHouse.com

# మక్కా చేరుకున్నపుడు యాత్రికుడు ఏమి చేయాలి?

మక్కా సరిహద్దులకు చేరుకున్న తరువాత, మక్కాలో ప్రవేశించక ముందు యాత్రికుడు స్నానం చేయటం మంచిది. ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సంప్రదాయం. అల్ మస్జిద్ అల్ హరమ్ చేరుకున్న తరువాత, సున్నతు ప్రకారం, ముందుగా కుడికాలు లోపలకు పెట్టి క్రింది దుఆ చదువుతూ లోపలికి ప్రవేశించవలెను.

బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహి, అఊదు బిల్లాహిల్ అజీమ్, వ బివజ్ హిల్ కరీమ్, వ సుల్తానిహిల్ ఖదీమ్, మినష్ షైతానిర్రజీమ్, అల్లాహుమ్మఫ్ తహ్ లీ అబ్వాబ రహ్మతిక

"అల్లాహ్ పేరుతో, రసూలుల్లాహ్ పై శాంతి మరియు దీవెనలు కురియుగాక, బహిష్కరింపబడిన షైతాను బారి నుండి; ఆయన యొక్క పవిత్ర ముఖము ద్వారా మరియు ఆయన యొక్క అత్యంత ప్రాచీన పరిపాలన మరియు అధికారం ద్వారా సర్వలోక శక్తిమంతుడైన ఆ అల్లాహ్ యొక్క శరణు కోరుతున్నాను. ఓ అల్లాహ్! నీ కారుణ్య ద్వారాలను నా కొరకు తెరుచు"

ఇతర మస్జిదులలో ప్రవేశించేటపుడు కూడా ఇదే దుఆ పఠించవలెను. నాకు తెలిసినంత వరకు, మస్జిద్ అల్ హరమ్ లో ప్రవేశించేటపుడు

పఠించమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిన ప్రత్యేక దుఆ ఏదీలేదు.

## మస్జిద్ అల్ హరమ్ లో ప్రవేశించటం మరియు తవాఫ్ (కాబా గృహ ప్రదక్షిణ)

కాబా గృహాన్ని సమీపించిన తరువాత, ఒకవేళ అతను హజ్జె తమత్తు లేదా ఉమ్రహ్ కొరకు సంకల్పం చేసుకుని ఉన్నట్లయితే, తవాఫ్ ఆరంభించక ముందు లబ్బైక్ పలకటం ఆపివేయవలెను. హజ్రె అస్వద్ (నల్లరాయి) దిశ వైపు నిలబడి, తన కుడి చేతితో దానిని స్పర్శించవలెను, వీలయితే దానిని ముద్దు పెట్టుకోవలెను. అలా చేయటంలో అతను ఇతరులను త్రోయటం గానీ, అసౌకర్యం కలిగించటం గానీ చేయరాదు. అతను దానిని స్పర్శించేటపుడు, ఇలా పలకవలెను – بسم الله، الله اكبر - బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్ – అల్లాహ్ పేరుతో, అల్లాహ్ మహోన్నతుడు. ఒకవేళ దానిని ముద్దాడటం కష్టమైతే, తన చేతితో లేదా తన చేతికర్రతో దానిని స్పర్శించి, ఆ చేతిని లేదా చేతికర్రను ముద్దాడవలెను. ఒకవేళ అలా చేయడం కూడా కష్టమైతే, హజ్రె అస్వద్ వైపు చేయితో సైగ చేసి, الله اكبر - అల్లాహు అక్బర్ – అల్లాహ్ మహోన్నతుడు అని పలుకవలెను. అయితే దూరం నుండి హజ్రె అస్వద్ వైపు ఊపిన చేతిని లేదా చేతికర్రను లేదా ఇతర వస్తువును ముద్దాడరాదు. తవాఫ్ ఆరంభించినపుడు కాబాగృహం అతని ఎడమ వైపు ఉండవలెను. తవాఫ్ ఆరంభించేటపుడు ఇలా పలకటం మంచిది,

అల్లాహుమ్మ ఈమానంబిక,  వ తస్దీకమ్ బి కితాబిక, వ వఫాఅమ్ బి అహ్దిక, వత్తిబాఅల్ లిసున్నతి నబియ్యిక ముహమ్మద్

"ఓ అల్లాహ్! నీపై విశ్వాసంతో, నీ గ్రంథంపై విశ్వాసంతో, నీకు చేసిన వాగ్దానాన్ని నేరవేరుస్తూ మరియు నీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానాన్ని అనుసరిస్తూ నేను దీనిని చేస్తున్నాను."

పై పద్ధతి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నుండి వారసత్వంగా సంక్రమించింది. తవాఫ్ లో ఏడు ప్రదక్షిణలు ఉంటాయి. మొదటి మూడు ప్రదక్షిణలలో రమల్ చేయవలెను. మక్కాలో ప్రవేశించిన తరువాత చేసే మొదటి తవాఫ్ లో ఇలా రమల్ చేయవలెను – ఆ తవాఫ్ ఉమ్రహ్ కోసమైనా, హజ్జె తమత్తు ఉమ్రహ్ కోసమైనా లేదా హజ్జె ఖిరాన్ ఉమ్రహ్ కోసమైనా సరే. మిగిలిన నాలుగు ప్రదక్షిణలను మామూలుగా నడుస్తూ పూర్తి చేయ వలెను. ప్రతి ప్రదక్షిణ హజ్రె అస్వద్ నుండి ఆరంభమవుతుంది మరియు హజ్రె అస్వద్ వద్దనే పూర్తవుతుంది. రమల్ అంటే వడివడిగా నడవడం. మొత్తం తవాఫ్ లో ఇద్తిబా చేయవలెను. ఉమ్రహ్ లేదా హజ్ కోసం చేసే తవాఫ్ లను తప్పించి, ఇతర తవాఫ్ లలో ఇద్తిబా చేయరాదు. ఇద్తిబా అంటే పై వస్త్రాన్ని తమ కుడి భుజం అందరికీ కనబడేలా కుడిచేయి చంక క్రింది నుండి తీసుకువచ్చి, ఎడమభుజం పై వాటి రెండు చివరలు ఉంచటం.

ఒకవేళ ఎవరికైనా తాము ఎన్ని ప్రదక్షిణలు చేసామో గుర్తులేక, వాటి సంఖ్య గురించి అనుమానం వస్తే, తాము అనుమానిస్తున్న రెండింటిలో తక్కువ సంఖ్యను తీసుకోవలెను. ఉదాహరణకు, ఒకవేళ ఎవరికైనా తాము మూడు ప్రదక్షిణలు చేసామా లేక నాలుగు ప్రదక్షిణలు చేసామా అనేది గుర్తు లేకపోతే, తాము మూడు ప్రదక్షిణలే చేసామని లెక్కించుకోవాలి. సయీలో కూడా ఇదే విధంగా చేయాలి. తవాఫ్ పూర్తి చేసిన తరువాత, తమ కుడిభుజాన్ని పైవస్త్రంతో కప్పివేయాలి. అంటే తవాఫ్ తరువాత, మఖామె ఇబ్రాహీం వద్ద చేసే రెండు రకాతుల నమాజు కంటే ముందు, తమ రెండు భుజాలను పై వస్త్రంతో నిండుగా కప్పుకోవాలి.

స్త్రీలు ముసుగులో ఉండటం మరియు తమ అందచందాలను ప్రదర్శించే విధంగా అలంకరించుకోకుండా ఉండటం తప్పనిసరి.
తవాఫ్ చేసేటపుడు స్త్రీలు అత్తరు లేదా పెర్ఫ్యూమ్ పూసుకోవటం, తమ అందచందాలను ప్రదర్శించటం వంటి వాటికి దూరంగా ఉండటం అనివార్యం. ఇహ్రాం స్థితిలో ఉండి తవాఫ్ చేస్తున్నపుడు కూడా వారు పరాయి పురుషులకు తమ ముఖం కనబడకుండా మరియు తమ సౌందర్యం ప్రదర్శించకుండా జాగ్రత్త వహించవలెను. వారు పురుషులకు దగ్గరగా ఉన్నపుడు, స్త్రీపురుషులు ఒకేచోట కలిసిమెలిసి ఉండే చోట ఇలా జాగ్రత్ర పడటం మరీ ముఖ్యం. ఎందుకంటే స్త్రీల ఆకర్షణ పురుషులను ఉశికొలుపే ఒక ప్రధాన కారణం కావటం వలన స్త్రీలు ముఖంపై ముసుగు వేసుకోవటం ఆవశ్యకం. ఎందుకంటే స్త్రీల అందాన్ని

ప్రధానంగా వారి ముఖం ప్రదర్శించటం వలన, పరాయి పురుషుల ముందు వారు తమ ముఖాన్ని ప్రదర్శించటం అనుమతించబడలేదు.

"... మరియు తమ భర్తల ముందు తప్ప తమ అందచందాలను వారు ప్రదర్శించరాదు" 24:31

ఒకవేళ హజ్రె అస్వద్ ను ముద్దాడే సమయంలో పురుషుల చూపు వారిపై ఉంటే, వారు తమ ముఖంపై ముసుగును తొలగించరాదు. ఒకవేళ హజ్రె అస్వద్ ను ముద్దాడే లేదా స్పర్శించే అవకాశం లేనంతగా అక్కడ జనం గుమిగూడి ఉండిన పరిస్థితిలో స్త్రీలు హజ్రె అస్వద్ ను ముద్దాడటానికి పురుషులతో పోటీపడకూడదు. స్త్రీలు తమ పురుషుల వెనుక నడుస్తూ, తవాఫ్ పూర్తి చేయవలెను. కాబా గృహానికి అతి దగ్గరలో నుండి తవాఫ్ చేసే వారిలో చొచ్చుకుని పోయి, రద్దీలో ఇబ్బంది పడే కంటే, కాబా గృహానికి కొంచెం దూరంలో నుండి ప్రశాంతంగా తవాఫ్ చేయటం మంచిది. పైగా దూరంలో నుండి తవాఫ్ చేయటంలో అడుగులు పెరగటం వలన ఎక్కువ పుణ్యాలు కూడా లభించే అవకాశం ఉంది. రమల్ మరియు ఇద్తిబాలను తవాఫ్ లో మాత్రమే పాటించాలి. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా చేరుకున్న తర్వాత చేసిన తన మొదటి తవాఫ్ లోనే రమల్ మరియు ఇద్తిబాలు చేసారు. అయితే స్త్రీలు రమల్ మరియు ఇద్తిబాలను చేయవలసిన అవసరం లేదు.

## తవాఫ్ మరియు సయీల కొరకు ప్రత్యేకమైన దుఆలు ఏమీ లేవు:

మొదటిసారైనా, తర్వాతైనా చేసే తవాఫ్ మరియు సయీలలో ప్రత్యేకమైన దుఆలు పఠించాలనే నియమం ఏదీ లేదు. ప్రతి తవాఫ్ ప్రదక్షిణలో ఒక ప్రత్యేకమైన దుఆ పఠించే పద్ధతిని కనిపెట్టిన కొందరి అలవాటుకు షరిఅహ్ లో ఎలాంటి ఆధారమూ లేదు. మీకు జ్ఞాపకం ఉన్న దుఆలలో నుండి ఏది పఠించినా సరిపోతుంది. రుకునె యమానీ (యమనీ మూల) వద్దకు చేరుకున్న తరువాత "బిస్మిల్లాహ్ (అల్లాహ్ పేరుతో), అల్లాహు అక్బర్(అల్లాహ్ మహోన్నతుడు)" అని పలికి, దానిని కుడి చేత్తో తాకవలెను. అయితే దానిని ముద్దాడకూడదు మరియు దానిని స్పర్శించిన కుడి చేతిని కూడా ముద్దాడకూడదు. ఒకవేళ రద్దీ వలన రుకునె యమానీని తాకటానికి అవకాశం లభించకపోతే, దాని వైపు చేయి ఊపుతూ సైగ చేయకుండా, అలానే తవాఫ్ కొనసాగించవలెను. అంతేగాక దానివైపు తిరిగి అల్లాహు అక్బర్ అని కూడా పలక కూడదు. అలా దూరం నుండి రుకునె యమానీ వైపు తిరిగి అల్లాహు అక్బర్ అని పలకటం నాకు తెలిసినంత వరకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సున్నతులో లేదు. రుకునె యమానీ మరియు హజ్రె అస్వద్ ల మధ్య నడిచేటప్పుడు ఈ క్రింది దుఆ పఠించటం వాంఛనీయం.

రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతవ్ వ ఫిల్ ఆఖిరతి హసనతవ్ వ ఖినా అదాబన్నార్ సూరహ్ అల్ బఖరహ్ 2:201

"ఓ మా ప్రభూ! ఈ ప్రాపంచిక జీవితంలో మాకు మంచిని ప్రసాదించు మరియు పరలోక జీవితంలో మాకు మంచిని ప్రసాదించు మరియు మమ్ముల్ని నరకాగ్ని నుండి రక్షించు."

హజ్రె అస్వద్ కు ఎదురుగా ఉన్నపుడు ‹దానిని తాకడానికి ‹ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ ‹"అల్లాహు అక్బర్ – అల్లాహ్ మహోన్నతుడు" అని పలుకవలెను .ఒకవేళ రద్దీ వలన అలా తాకడం లేదా ముద్దుపెట్టుకోవడం కష్టమైతే ‹హజ్రె అస్వద్ కు ఎదురుగా వచ్చినపుడల్లా ‹దాని వైపు సంజ్ఞ చేస్తూ ‹అల్లాహు అక్బర్ అని పలుకవలెను .మఖామె ఇబ్రాహీం లేదా జమ్ జమ్ బావి వెనుక నుండి తవాఫ్ చేయటంలో ఎలాంటి దోషమూ లేదు ముఖ్యంగా బాగా రద్దీగా ఉన్నపుడు .తప్పనిసరిగా కాబాగృహానికీ మరియు మఖామె ఇబ్రాహీం లేదా జమ్ జమ్ బావిల మధ్య నుండే తవాఫ్ చేయాలనే నియమం ఏదీ లేదు .మస్జిదె హరమ్ మొత్తంలో ఎక్కడి నుండైనా తవాఫ్ చేయవచ్చు . రద్దీ బాగా ఎక్కువగా ఉన్నపుడు ‹కాబా గృహం చుట్టూ ఉన్న మస్జిదు భవనం కప్పు పై నుండి తవాఫ్ చేయటంలో కూడా ఎలాంటి దోషమూ లేదు .అయితే ‹అవకాశం ఉంటే కాబా గృహం దగ్గరలో నుండి తవాఫ్ చేయటం ఉత్తమం .

అలాగే ‹అవకాశం లభిస్తే ‹తవాఫ్ పూర్తి చేసిన తరువాత మఖామె ఇబ్రాహీం వద్ద రెండు రకాతుల నమాజు చేయటం ఉత్తమం .రద్దీగా

ఉండటం వలన ఒకవేళ అలా చేయలేక పోతే ‹తవాఫ్ పూర్తి చేసిన తరువాత కాబా మస్జిదులో మీకు వీలయిన చోట రెండు రకాతుల నమాజు చేసుకోవలెను .

ఈ రెండు రకాతుల నమాజులో సూరతుల్ ఫాతిహా తరువాత మొదటి రకాతులో సూరతుల్ కాఫిరూన్ మరియు రెండో రకాతులో సూరతుల్ ఇఖ్లాల్ పఠించవలెను .ఇలా పఠించటం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సున్నతులో ఉన్నది .

తవాఫ్ పూర్తి చేసి) ‹మఖామె ఇబ్రాహీం వద్ద రెండు రకాతుల నమాజు పూర్తి చేసి ‹జమ్ జమ్ నీరు త్రాగి (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతును అనుసరిస్తూ ‹హజ్రె అస్వద్ వైపు తిరిగి ‹వీలయితే దానిని కుడిచేతితో తాకి ‹సఫా కొండ వైపు సాగిపోవలెను .

సయీా) సఫా మరియు మర్వా కొండల మధ్య నడక (ప్రారంభించటానికి ‹ సపా కొండపై ఎక్కి నిలబడ వలెను .

## సయీా మరియు దాని నియమాలు

ఒకవేళ అవకాశం లభిస్తే, అక్కడ అల్లాహ్ ను ధ్యానించేటప్పుడు మరియు ఈ క్రింది దుఆ పఠించేటప్పుడు, సఫా కొండ పైకి ఎక్కవలెను, కాబా గృహం వైపు తిరిగి నిలబడవలెను.

*లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు లా షరీక లహు, లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు, యుహ్ఈ వ యుమీతు, వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్. లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు, అంజజ వఆదహు, వ నసర అబ్దుహు, వ హజమ అహ్ జాబ వహదహు* - ఆరాధింపబడే అర్హత కలిగిన వాడెవ్వడూ లేడు - ఒక్క అల్లాహ్ తప్ప. అల్లాహ్ యే మహోన్నతుడు. ఆరాధింపబడే అర్హత కలిగిన వాడెవ్వడూ లేడు - ఒక్క అల్లాహ్ తప్ప. ఆయన ఏకైకుడు. ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు. విశ్వమంతా ఆయనకే చెందింది మరియు సకల ప్రశంసలు ఆయనకే చెందుతాయి. చావు బ్రతుకులు ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. ప్రతి దానిపై ఆయనకు ఆధిపత్యం ఉన్నది. ఆరాధింపబడే అర్హత కలిగిన వాడెవ్వడూ లేడు – ఒక్క అల్లాహ్ తప్ప. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చినాడు, తన దాసునికి సహాయం చేసినాడు, కేవలం ఆయనే ఒంటరిగా అహ్ జాబ్ (అవిశ్వాస తెగల మొత్తం) సమూహాన్ని ఓడించినాడు.

ఇలా పఠించిన తరువాత, రెండు చేతులూ పైకెత్తి, వీలయినన్ని ఎక్కువ దుఆలు చేసుకోవలెను. ఒక్కో దుఆ మూడు సార్లు పఠించవచ్చు. సఫా కొండ పైనుండి క్రిందికి దిగిన తరువాత, మర్వా కొండ వైపు నడక సాగించవలెను. ఆకుపచ్చ రంగు లైటు నుండి మరో ఆకుపచ్చ రంగు లైటు వరకు పురుషులు వడివడిగా (పరుగు పరుగున) నడవ వలెను. అయితే స్త్రీలు అలా చేయవలసిన అవసరం లేదు, సయీ మొత్తాన్ని

వారు మామూలు నడకతో పూర్తి చేయవలెను. మర్వా కొండ వద్దకు చేరుకున్న తరువాత, దాని పైకి ఎక్క వలెను, ఒకవేళ అవకాశం లభించక పోతే, కొండ ప్రక్కన నిలుచో వలెను. కొండ పైకి ఎక్కటం ఉత్తమం. సఫా వద్ద పఠించిన విధంగా ఇక్కడ కూడా పఠించవలెను. ఈ విధంగా ఒక సయీ నడక పూర్తవుతుంది.

మర్వా కొండ దిగిన తరువాత, సపా వైపు నడక సాగిస్తూ, వేగంగా నడవ వలసిన ఆకు పచ్చ లైట్లు వచ్చినపుడు వడి వడిగా నడిచి, సఫా కొండ వద్దకు చేరుకోవలెను. ఈ విధంగా రెండో సయీ నడక పూర్తవుతుంది. ఇలా ఏడు సార్లు సఫా మరియు మర్వాల మధ్య నడవ వలెను. సఫా నుండి మర్వా వద్దకు చేరుకోవటం ఒక సయీ నడకగా పరిగణింపబడుతుంది. అలాగే మర్వా నుండి సఫా వద్దకు మరల చేరుకోవటం రెండో సయీ నడకగా పరిగణింప బడుతుంది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇదే విధంగా చేసినారు మరియు ఆయన ఇలా పలికినారు: " హజ్ నియమాలను నా నుండి నేర్చుకోండి."

సయీ నడకలో వీలయినంత వరకు అల్లాహ్ ను ధ్యానిస్తూ, దుఆలు చేసుకోవలెను. అన్ని రకాల అపరిశుద్ధతల నుండి దూరంగా ఉండటానికి ప్రయత్నించవలెను. వుదూ లేక పోయినా సయీ నడక సాగించడానికి అనుమతి ఇవ్వబడింది. తవాఫ్ పూర్తి చేసిన తరువాత ఒకవేళ ఎవరైనా స్త్రీకి, నెలసరి బహిష్టు వచ్చినా, పురుటి రక్తస్రావం

మొదలైనా, ఆమె ఆ స్థితిలోనే సయీ నడక కొనసాగించవచ్చును. ముందు తెలిపినట్లుగా, సయీ నడక కొరకు తప్పనిసరిగా వుదూలోనే ఉండవలసిన అవసరం లేదు. సయీ నడక పూర్తయిన తరువాత, పురుషులు తమ తల వెంట్రుకలు పూర్తిగా గొరిగించు కోవలెను లేదా చిన్నవిగా కత్తిరింపబడేలా క్షవరం చేయించుకోవలెను. పురుషులు తమ తల వెంట్రుకలు పూర్తిగా గొరిగించుకోవటం మంచిది. అయితే, ఉమ్రహ్ లో తల వెంట్రుకలు చిన్నవిగా కత్తిరింపజేసుకుని, హజ్ లో పూర్తిగా గొరిగించుకోవటం ఉత్తమం. అలాగే ఎవరైనా హజ్ సమయానికి దగ్గరలో ఉమ్రహ్ చేస్తే, అతను తమ వెంట్రుకలు చిన్నవిగా కత్తరింపజేసుకుని, హజ్ తరువాత పూర్తిగా తల వెంట్రుకలు గొరిగించుకోవటం మంచిది. హజ్ కొరకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులు దిల్ హజ్ 4వ తేదీన మక్కా చేరుకున్నారు. ఎవరైతే తమతో పాటు ఖుర్బానీ పశువులను వెంట తీసుకురాలేదో, వారిని తమ తల వెంట్రుకలు చిన్నవిగా కత్తిరింపజేసుకుని ఇహ్రాం స్థితి నుండి బయట పడమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించినారు. పూర్తిగా తమ తల వెంట్రుకలు గొరిగించుకోమని ఆయన వారిని ఆదేశించలేదు. అయితే హజ్ తరువాత పూర్తిగా తమ తల వెంట్రుకలు గొరిగించుకోవాలని ఆదేశించారు. అంతేగాని, చిన్నగా కత్తిరించుకోవచ్చని లేదా కొంత వరకే తొలగించుకోవచ్చని చెప్పలేదు. స్త్రీల కొరకు షరిఅహ్ ఆదేశం ఏమిటంటే, ఆమె కొన్ని వెంట్రుకలు మాత్రమే కత్తిరించుకోవాలి. కొద్దిగా మాత్రమే మాత్రమే కత్తిరించుకోవాలి.

అంతకంటే ఎక్కువగా, అంటే పురుషులు కత్తిరించుకునేటంత ఎక్కువగా కత్తిరించుకోకూడదు. ఈ ఆచరణలు పూర్తి చేయటం ద్వారా మీ ఉమ్రాహ్ పూర్తవుతుంది. అలాగే ఇహ్రాం స్థితిలో మీపై ఉండిన నిషేధాలన్నీ ఇపుడు తొలగిపోతాయి. అయితే తమ వెంట ఖుర్బానీ పశువు తీసుకు వచ్చినవారు (ఖిరాన్ పద్ధతిలో హజ్ చేస్తున్నవారు) తమ ఇహ్రాం స్థితిని విడిచి పెట్టక, ఇంకా కొనసాగించవలసి ఉంటుంది. ఉమ్రాహ్ మరియు హజ్, రెండూ పూర్తి చేసిన తరువాతనే అతను ఇహ్రాం స్థితి నుండి బయటపడతాడు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతును అనుసరించి ఎవరైతే హజ్ చేయాలనే సంకల్పంతో లేదా ఉమ్రహ్ మరియు హజ్ చేయాలనే సంకల్పంతో ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించారో, అలాంటి వారు ఉమ్రహ్ పూర్తయిన తరువాత ఇహ్రాం స్థితిని విడిచి పెట్టవలెను. హజ్జె తమత్తు కొరకు నిర్దేశించబడిన విధానాన్నే అతను కూడా అనుసరించవలెను. కానీ, ఎవరైతే తమ వెంట ఖుర్బానీ పశువును తీసుకు వస్తారో, అలాంటి వారు దీనిని పాటించకూడదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులకు ఇలా ఆదేశించినారు:

"నేను ఒకవేళ నా వెంట ఖుర్బానీ పశువును తీసుకు వచ్చి ఉండక పోయినట్లయితే, ఇహ్రాం స్థితిని విడిచి పెట్టడంలో నేనూ మీతో చేరిపోయేవాడిని."

ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించిన తరువాత, ఒకవేళ ఎవరైనా స్త్రీకి బహిష్టు రక్తస్రావం లేదా పురుటి రక్తస్రావం మొదలైతే, ఆమె మరల పవిత్రురాలయ్యే వరకు తవాఫ్ మరియు సయీ చేయకుండా ఆగిపోయి, అవి పూర్తి చేసిన తరువాత తల వెంట్రుకలు కత్తిరింపజేయటం చేయలెను. ఈ విధంగా ఆవిడ ఉమ్రహ్ పూర్తవుతుంది. అయితే, 8వ దిల్ హజ్ లోపల ఆమె రక్తస్రావం నుండి పవిత్రురాలు కాలేకపోతే, మక్కాలో ఎక్కడైతే బస చేసినదో, అక్కడే ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించి, మిగిలిన వారందరూ వెళ్ళుచున్నట్లుగా మీనాకు బయలుదేర వలెను. ఈ అపవిత్ర స్థితి ఆమె హజ్ పద్ధతిని ఖిరాన్ పద్ధతికి మార్చుతుంది. మిగిలిన హజ్ యాత్రికుల వలే ఆమె కూడా అరాఫాత్  మైదానంలో నిలబడవలెను, ముజ్దలిఫాలో రాత్రి గడపవలెను, జమరాత్ పై రాళ్ళు విసిరి, రమీలో పాల్గొనవలెను. ఖుర్బానీ పశువును ఖుర్బానీ చేయవలెను. కొద్దిగా తల వెంట్రుకల చివరలు కత్తిరింపజేసుకోవలెను. పవిత్ర స్థితి పొందిన తరువాత, ఆమె కేవలం ఒకసారి మాత్రమే తవాఫ్ మరియు సయీ పూర్తి చేయవలెను. ఇది ఆమె యొక్క ఉమ్రహ్ మరియు హజ్, రెండింటికీ సరిపోతుంది. ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖించిన హదీథు ప్రకారం, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించిన తరువాత ఆమెకు బహిష్టు రక్తస్రావం మొదలైంది. అపుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెకు ఇలా చేయమని ఆదేశించారు,

“కాబా గృహం యొక్క తవాఫ్ తప్ప, మిగిలిన ఆచరణలన్నీ ఇతర హాజ్ యాత్రికులు చేస్తున్నట్లుగానే నీవు కూడా ఆచరించు. అయితే పవిత్రత పొందిన తరువాత దానిని (తవాఫ్) పూర్తి చేయి.”

జమరాత్ పై కంకర రాళ్ళు విసిరిన తరువాత మరియు తల వెంట్రుకల చివరలు కత్తిరింపజేసుకున్న తరువాత బహిష్టు లేదా పురుటి రక్తస్రావం స్థితిలో ఉన్న స్త్రీలపై ఉండిన అత్తరు పూసుకోవటం వంటి ఇహ్రాం స్థితి నిబంధనలు తొలగి పోతాయి – తన భర్తతో శారీరకంగా కలిసే నిషేధం తప్ప. పవిత్రురాలైన తరువాత ఆమె తవాఫ్ మరియు సయీ చేసినపుడు మాత్రమే ఈ నిబంధన తొలగిపోతుంది. ఇతర స్త్రీలు చేసినట్లుగా ఆమె కూడా హజ్ పూర్తి చేసి, పవిత్ర స్థితిలో తవాఫ్ మరియు సయీ పూర్తి చేసిన తరువాత తన భర్తతో శారీరకంగా కలిసే నిబంధనతో పాటు ఆమెపై ఉన్న ఇహ్రాం నిబంధనలన్నీ తొలిగిపోతాయి.
దిల్ హజ్ నెల 8వ తేదీన హజ్ చేయాలని సంకల్పించుకున్న మక్కావాసులు మరియు ఇతర తమత్తు హజ్ యాత్రికులు తమ నివాస స్థలం నుండే ఇహ్రాం దుస్తులు ధరించి, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలెను. తన హజ్జతుల్ విదాలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులు మక్కాలోని అబ్తహ్ అనే ప్రాంతంలో బస చేసినారు. దిల్ హజ్ 8వ తేదీన తాము బస చేసిన ఇంటి నుండే ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించమని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులకు ఆదేశించారు. అంతేగాని కాబా

గృహం వద్దకు వెళ్ళి లేదా మిజాబ్ వద్దకు వెళ్ళి ఇహ్రాం దుస్తులు ధరించమని, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించమని ఆయన వారిని ఆదేశించలేదు. అలాగే మీనాకు బయలుదేరే ముందు వీడ్కోలు తవాఫ్ చేయమని కూడా ఆయన వారిని ఆదేశించలేదు. ఒకవేళ అలా చేయటమనేది షరిఅహ్ లో భాగమై ఉంటే, ఆయన వారిని అలా చేయమని తప్పకుండా ఆదేశించి ఉండేవారు. కేవలం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరుల పద్ధతిని మాత్రమే అనుసరించడంలో అన్ని రకాల శుభాలు మరియు సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. ఎలాగైతే మీఖాత్ వద్ద ఇహ్రాం దుస్తులు ధరించేటపుడు వీలయితే స్నానం చేసి అత్తరు పూసుకుంటారో, అలాగే హజ్ కొరకు ఇహ్రాం ధరించేటపుడు కూడా చేయవలెను.